క్లుప్తంగా

బాధితులకు వైఎస్సార్ సీపీ ఆపన్నహస్తం



నరసరావుపేట: మాజీ శాసనసభ్యులు గోపి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయం చేసేందుకు మేము సైతం అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ముందుకొస్తున్నారు. అందులో భాగంగా గురువారం 27వ పార్టీ నాయకుడు కట్టా బుజ్జీ 150 చీరలు, 150 బెడ్ షీట్స్,150 కేజీల కందిపప్పు, అలాగే వసంతరావు-100 కేజీలు కందిపప్పు, 18వ వార్డు ఇన్‌చార్జి జమ్ముల రాధా 20 బెడ్ షీట్లు, 15 చీరలు అందజేశారు. ఐదో వార్డు క్రిస్టియన్‌పాలెం నాయకులు కుక్కల పోలు, కందుల ఎజ్రా, మాణిక్యమ్మ, ప్రసాద్, నాగేశ్వరరావు 25 చీరలు, 25 దుప్పట్లు అందజేశారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తాం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మక్కెన నగర్‌లో మున్సిపల్ కమిషనర్ ఎం. సుభాష్ చంద్రబోస్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని వసతులను పరిశీలించారు. 4వ లైన్‌లో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మితిమీరిన కాలుష్యంతో ఓజోన్ పొరకు నష్టం




నాదెండ్ల: మితిమీరిన కాలుష్యం, చెట్లను నరికి వేయటం వంటి కారణాలతో భూగోళం వేడెక్కి ఓజోన్ పొరకు నష్టం వాటిల్లుతోందని, అంతిమంగా భూమిపై జీవరాశి మనుగడ ప్రమాదంలో పడుతున్నదని హెచ్‌ఎం నిర్మల చెప్పారు. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. చిన్నారులకు ఓజోన్ పొర ఆవశ్యకతపై డ్రాయింగ్, వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, శిలాజ ఇంధనాల అధిక వినియోగం వంటి కారణాలతో భూమిలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయన్నారు. జిల్లా సైన్స్ కాంగ్రెస్ అధికారి రాజశేఖర్, ఉపాధ్యాయులు కె.రెడ్డియ్య, రామచంద్రనాయక్, సుభాని, ప్రభావతి, సాంబశివరావు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించండి

నరసరావుపేట: మాజీ ఏఐసీసీ అధ్యక్షులు, పార్లమెంటు ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శివసేన షిండే వర్గం ఎంఎల్‌ఏ సంజయ్ గైక్వాడ్, బీజేపీ నాయకులపై విచారణ జరిపి దాని వెనుక ఎవరున్నారో బయటకు తీసి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ సంతోష్‌కు గురువారం ఫిర్యాదు అందజేశారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు జి.అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యములో రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలను నిరసన ప్రదర్శన చేశారు. అలెగ్జాండర్ సుధాకర్, సీనియర్ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ మాట్లాడుతూ త్యాగాల కుటుంబ వారసుడు రాహుల్‌గాంధీ జోడో యాత్రతో ప్రజలంతా బ్రహ్మరథం పడుతుంటే బీజేపీ, వారి మిత్రపక్షాలు ఆయనపై అక్కస్సుతో చంపుతామని బెదిరించిన వైనంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సూర్యనాయక్, ఎస్.ఎం. బాషా, సీదా కృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విజయావకాశాల కోసం సాధికారత నైపుణ్యాలు



నరసరావుపేట: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో గురువారం 'వృత్తిపరమైన విజయం కోసం సాధికారత నైపుణ్యాలు' వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ ఈఎఫ్‌ఎల్‌యు ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జి.సువర్ణలక్ష్మి సెషన్స్ ప్రారంభించి కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాముఖ్యతపై ఇంటరాక్టివ్ టాక్‌తో ప్రసంగించారు. ఫ్రెయర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ సారిక చౌదరితో సహా ప్రముఖ వక్తలు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాసరావు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, వివిధ విభాగ అధిపతుల వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఆటలతో విద్యార్థుల సందడి

నరసరావుపేటలో ఓనం వేడుకలు

- నందడి చేసిన కేరళ విద్యార్థులు
- వెల్లివిరిసిన కేరళ సంప్రదాయం

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో కేరళ సంప్రదాయం వెల్లివిరిసింది. కళాశాలలో నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న కేరళ రాష్ట్ర విద్యార్థులు గురువారం తమ సంప్రదాయ పండుగ ఓనం ఘనంగా నిర్వహించారు. కేరళ సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు, ఆటపాటలతో ఓనం పండుగను జరుపుకున్నారు. పూలతో రంగవల్లులు దిద్ది మధ్యలో ఎత్తుగా ఉన్న దీపం ప్రమిదను ఏర్పాటు చేసి దాని చుట్టూ సాంప్రదాయ నృత్యం చేస్తూ ఆకట్టుకున్నారు. స్వస్థలాలను విడిచి వందల కిలోమీటర్లు దూరంలో చదువుకుంటున్నప్పటికీ తమ సంస్కృతికి కేరళ విద్యార్థులు పెద్దపీట వేయటం పట్ల కళాశాల పాలకవర్గం, అధ్యాపకులు, విద్యార్థులు స్వాగతించి ఓనం శుభాకాంక్షలు తెలిపారు. ఓనం వేడుకల్లో భాగంగా విద్యార్థులు కేరళ సంప్రదాయ వంటకాలు (11 రకాలు)తో విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ రేణుకాదేవి, ఏఓ ఏవీఎస్ గుప్త, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నూజెండ్లలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



ఈపూరులో పాల్గొన్న క్రీడాకారులతో పీఈటీలు



జిల్లాకు ఎంపికైన జూడో జట్లతో సెలక్టర్లు, నిర్వాహకులు

ఆట మొదలయ్యింది!

- మండలస్థాయి పాఠశాల ఆటల పోటీలు ఆరంభం
- క్రీడాకారులను ఉత్సాహపరిచిన నిర్వాహకులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని లయోలా హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 బాల, బాలికలకు మండలస్థాయి ఆటల పోటీలు సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలను ఫాదర్ రవి ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ నందు పోటీలను నిర్వహించి జట్లను ఎంపిక చేసినట్లు వినుకొండ మండల కోఆర్డినేటర్ కె.వి.రమణ బాబు తెలిపారు. 18 స్కూల్స్ నుంచి 400 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీడీలు వై.యల్లమందరావు, జి.వీరాంజనేయులు, బి.అనురాధ, సుధారాణి, అంకారావు, వి.పాపారావు, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్లలో...

వినుకొండ(నూజెండ్ల): మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను నూజెండ్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్యలు పాల్గొని ప్రారంభించారు. ఈ 21వ తేదీ వరకు ఈ ఆటల పోటీలు జరుగుతాయని కన్వీనర్ పీఈటీ వెంకటరత్నం తెలిపారు. అండర్-17, అండర్-14 విభాగాల్లో బాలబాలికలకు వివిధ విభాగాల్లో ఆటల పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ గురువారం నిర్వహించారు. అండర్-14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రామతులసి, ఆర్గనైజేషన్ సెక్రటరీ మద్దం వెంకటేశ్వర్లు, పీఈటీలు వై.వి.చిరంజీవి, కె.యేసురాజు, రూత్‌మేరి, కె.వెంకట గోపి, ఆర్. శ్రీనివాస్, కె. శ్రీహరి పాల్గొన్నారు.



నూజెండ్లలో జరిగిన కబడ్డీలో పోటీ పడుతున్న బాలికలు



ఉప్పలపాడులో రిబ్బన్‌కట్‌చేసి క్రీడలు ప్రారంభిస్తున్న మండల విద్యాశాఖ అధికారి

జూడో జిల్లా జట్ల ఎంపిక

చిలకలూరిపేట: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూడో సెలక్షన్స్ పోటీలు ఏఎంజీ హైస్కూల్‌లో నిర్వహించారు. దీనిలో భాగంగా అండర్-14, అండర్-17 బాలబాలికల జట్లను గురువారం ప్రకటించారు. ఎంపికైన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లు త్వరలో తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూడో పోటీలలో పాల్గొంటారు. జట్ల వివరాలు ఇలా ఉన్నాయి. వీరిలో అండర్-14 బాలుర జట్టుకు కె.జాషువా, కె.చైతన్యరెడ్డి, డి . రేవంత్‌బాబు, కె.రాజ్‌కుమార్, ఎం.వినోద్‌కుమార్, ఎస్.యశ్వంత్, టి.ఫ్రానీజాకోబ్ జోన్స్ ఉన్నారు. అలాగే అండర్-14 బాలికల జట్టుకు ఎం.ప్రశాంత ధన్య, ఎస్.హవీలా, ఎ.కావ్య, పి. పావని, ఎం.లాస్య, బి.భానుశ్రీ, వై.అమూల్య ఉండగా అండర్-17 బాలుర జట్టుకు జె.దిలీప్‌కుమార్, బి.జాన్ జోసఫ్, వి.అభినయ్, ఎం. మనోహర్‌దాస్, జి.యహోషువా, వై.నితిన్‌రెడ్డి, డి. నందకుమార్, కె.నాగమణికంఠ, టి.పవన్‌కుమార్, జి.దిలీప్ ఎంపికయ్యారు. ఇక అండర్-17 బాలికల జట్టుకు జి.ప్రభావతి, డి.జెస్సికా, టి. దుర్గాభవాని, కె.రోజా, జి.సుష్మ, జి.శ్రీలత, టి. సంజన, డి.ప్రిన్సీ, వై.యశస్వినీ లక్ష్మీప్రియ ఉన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, స్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు షేక్ ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో..

నరసరావుపేట: మండలంలోని ఉప్పలపాడు వైవీఎస్ఆర్ అండ్ వైవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి స్కూలు గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు, ఎంపికలను మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగేశ్వరరావు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికులు, క్రీడాకారులు, డాక్టర్లు సమాజానికి చాలా అవసరమని, విద్యార్థులకు క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు.

జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదిగేలా ఆటలు ఆడాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, మండల కన్వీనర్ వై.రామకృష్ణారెడ్డి, యాజమాన్య కమిటీ ఛైర్మన్ ఎం.లక్ష్మీనరసమ్మ, వైస్ ప్రెసిడెంట్ కె.చిన్న, వ్యాయామ ఉపాధ్యాయురాలు జె.ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న సాతులూరులో...



సాతులూరులో క్రీడా పోటీలకు సిద్ధమైన ప్రాంగణం

నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగాల్సిన ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు 20వ తేదీకి వాయిదా పడినట్లు చిరుమామిళ్ళ పీఈటీ, ఫెడరేషన్ క్రీడాశ్రీ కేవీ నాగరాజు తెలిపారు. 20న సాతులూరు జెడ్పీ హైస్కూలులో వాలీబాల్ పోటీలతో పాటూ ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ జరుగుతాయన్నారు. 21న అమీన్‌సాహెబ్‌పాలెం జెడ్పీ హైస్కూలులో యోగా, చెస్ పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమౌతాయన్నారు. ఈ నెల 23న నియోజకవర్గ స్థాయిలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు.

జాతీయ ఆట్యా-పాట్యా పోటీలకు వాగ్దేవి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి ఆట్యా-పాట్యా పోటీలకు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీలలో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన అంతర్ జిల్లాల బాల బాలికల పోటీలలో పల్నాడు జిల్లా ప్రథమ స్థానం సాధించగా, జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన తమ విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. బాలికల విభాగంలో పసుపులేటి తిరుపతమ్మ, బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావు, షేక్.ఆల్మాస్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కపలవాయి రాజేంద్రప్రసాదు, కృష్ణారావు, కాట్ల రామకోటేశ్వరరావు, పీడీ రాయల ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కళాశాల సిబ్బంది



నిమజ్జనానికి తరలిస్తున్న విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాలతో వెంకటేశ్వర్లు, కనకరాములు

ఈసటికి వెళ్లిరావయ్యా.. గణపయ్యా..

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి 13 రోజుల పూజల అనంతరం గురువారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పందిట్లో ఏర్పాటు చేసిన 20 కేజీల లడ్డూ ప్రసాదాన్ని అంగలూరి చిన వెంకటేశ్వర్లు రూ.1.35 లక్షల రూపాయలు వేలంలో దక్కించుకున్నారు. అలాగే 9 కేజీల లడ్డూ ప్రసాదాన్ని బొజ్జ కనకరాములు రూ.30 వేల రూపాయలకు వేలంలో పాడుకున్నారు. చల్లగుండ్ల అడ్డరోడ్డులో గల గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు తరలించి నిమజ్జనం చేశారు. దారి పొడవునా ప్రసాదాలు అందజేశారు.

గుడ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన



బుచ్చిబాపన్నపాలెంలో అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం



రొంపిచర్లలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థినులు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం, రొంపిచర్ల, వీరవట్నం గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌ల ఆధ్వర్యంలో గురువారం పాఠశాలల్లో విద్యార్థులందరికీ బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బుచ్చిబాపన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశీదేవి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య విషయాలను వివరించారు. అలాగే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్స్‌ను వివరించారు. వీరవట్నం గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో బాలల హక్కులపై అవగాహనతో పాటు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. అలాగే రొంపిచర్లలో కౌమారదశలో ఉన్న వారందరినీ కలుపుకొని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం టీవీ సుబ్రహ్మణ్యం, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా పోలీస్‌లు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీడీవో ఎన్.వెంకటేశ్వర్లు
- ఉప్పలపాడులో స్వచ్ఛతా హీ సేవ



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

నరసరావుపేట: మన చుట్టూ ఉండే పరిసరాలు, వీధులు శుభ్రంగా ఉంటేనే అందరమూ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్-ఎన్‌జీవో సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ఉప్పలపాడులోని హైస్కూలులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పాటై ర్యాలీ, ప్రతిజ్ఞచేశారు. వీరిని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎంఈవో నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ రమేష్, ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, మండల కో ఆర్డినేటర్ అయ్యపరెడ్డి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట కమిషనర్‌గా శ్రీహరిబాబు



చిలకలూరిపేట: నూతన మున్సిపల్ కమిషనర్‌గా పి.శ్రీహరిబాబు, గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా ఉన్న సీహెచ్ గోవిందరావు మాతృశాఖ అయిన ఏపీ సచివాలయానికి బదిలీపై వెళ్లారు. నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టిన శ్రీహరిబాబుకు మున్సిపల్ డీఈఈ టి వెంకటరమణ, ఏఈలు, మున్సిపల్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

29న నరసరావుపేటలో 5కే వాక్

మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ కారసాని



నరసరావుపేట: ఈనెల 29న ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు గుండె సమస్యలపై అవగాహన కల్పించేందుకు తమ వైద్యశాల ఆధ్వర్యంలో ఐదు కిలోమీటర్ల (5కే వాక్) నిర్వహిస్తున్నట్లు మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎం.డి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం హాస్పిటల్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. ప్రజలకు ముందస్తుగా గుండె జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ కోడెల శివప్రసాదరావు స్టేడియం (డీఎస్ఏ) దగ్గర ఉదయం 6 గంటలకు ప్రారంభమై 7 గంటల వరకు 5కే నడక కొనసాగుతుందన్నారు. ఈ వాక్ స్టేడియం నుంచి మొదలై బైపాస్ రోడ్డు, రెడ్డి కళాశాల, మల్లమ్మసెంటర్ మీదుగా మళ్లీ స్టేడియంకు చేరుతుందన్నారు. దీనిలో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్న మొదటి 2 వేల మందికి రూ.500లు విలువచేసే టీషర్టు, క్యాప్ ఉచితంగా అందజేయటం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఎం.మల్లారెడ్డి-95023 04422, పీవీ సుబ్బారావు-63001 84095, ఎం.వెంకట గోపిరెడ్డి-83097 97392 నంబర్లను సంప్రదించాలని కోరారు. రిజిస్టర్ చేసుకున్న వారిలో లక్కీడ్రా ద్వారా ఎంపికచేసిన నలుగురికి ఒక్కొక్కటి రూ.10 వేలు విలువచేసే బీఎస్ఏ ఎస్‌ఎల్‌ఆర్ (ఫొటాన్) సైకిల్ అందజేయటం జరుగుతుందన్నారు.

బైక్ దొంగ అరెస్టు

నాదెండ్ల: గణపవరంలో గత నెల 22న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన యువకుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గణపవరం సినిమాహాలు రోడ్డులో నివాసం ఉండే గుంటుపల్లి శ్రీనివాసరావు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి చిలకలూరిపేటలోని ఓ వేడుకకు హాజరయ్యారు. రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి రాగా, ఇంటి ముందు ద్విచక్ర వాహనం కనిపించ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గణపవరం కుప్పగంజి వాగు సమీపంలో నివాసం ఉండే అచ్చి అంకమ్మ బైక్‌ను దొంగిలించినట్లుగా గుర్తించి నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పొలంలో నడచి వెళ్తున్న వ్యక్తిపై దాడి

ఈపూరు: తమ పొలం దారిలో నుంచి వెళ్తున్నాడని ఒక వ్యక్తిపై కొడవలితో దాడి చేసిన సంఘటన మండలంలోని చినకొండాయపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... చినకొండాయపాలెం గ్రామానికి చెందిన గోరంట్ల సురేష్ గడిపూడి చిన్నకోటయ్య (బుజ్జి) పొలం దారిలో నుంచి వెళ్తుండగా ఇటువైపు నుంచి దారి లేకపోతే ఇటు నుంచి ఎలా వెళ్తావని చిన్నకోటయ్య సురేష్ చేతిపై నరికాడు. దీంతో తీవ్రగాయాలైన సురేష్ చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



నరసరావుపేటటౌన్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తన్నీరు సుబ్బారావు గురువారం తెలిపారు. మునుమాక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు క్రిందపడి గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. మృతుడు కాఫీ రంగు నిండు చేతులు చొక్కా నలుపు రంగు లోయర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నరసరావుపేట రైల్వే ఐ.టి. సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, మృతుడి వివరములు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించలని కోరారు.